# (బహు)మతి పోయింది

– కె. లక్ష్మీకాంతమ్మ

''మోసం నాదా, నీదా?!'' కోపంగా అన్నాడు గవర్రాజు.

''ఎవర్నైనా అడుగు చెప్తారు'' అన్నాన్నేను–ఏమాత్రం ఇరిటేట్ కాకుండా.

''కడుపుకి అన్నం తినేవాళ్లెవరూ నీ పక్షాన మాట్లాడరు...'' మరింత కోపంగా అన్నాడు వాడు.

''సరే పిలువైతే, ఏ పెద్దమనిషిని పిలుస్తావో'' జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ బైటికి తీసి ఒకటి ముట్టించుకున్నాను. వాడు నాకేసి క్రోధంగా చూస్తూండటం ఓరకంట గమనిస్తూనే రింగు రింగులుగా పొగ వదుల్తూ కూర్చున్నాను.

''దీనికి ఎవర్నో పిలవడం దేనికీ? మొన్న మన్తోపాటు మహేష్‌గాడు కూడా వచ్చాడుగా! వాణ్ణి రానియ్...వాడే చెప్తాడు ఎవరిది మోసమో!'' అన్నాడు గవర్రాజు.

''వాడి మొహం! వాడు చెప్పేదేంటీ, నేను వినేదేంటి? డబ్బులు నావి కాబట్టి న్యాయంగా ఆ ప్రైజు నాకే చెందాలి! అదే ధర్మం'' అన్నాన్నేను మొండిగా.

''డబ్బులు నీవే కావచ్చు. కానీ నువ్ మమ్మల్నేం ఊరికే తీస్కెళ్లలేదుగా? మీకు ఎం.ఒ.లు రాగానే ఇచ్చేయాలి సుమా అని ఒకటికి పదిసార్లు చెప్పి మరీ తీస్కెళ్లావ్! అంటే మాకిచ్చింది కేవలం అప్పే! సో..ఎవడి టికెట్ మీద వాడికి హక్కున్నట్టే లెక్క. సో..ఎవడి టికెట్‌కి ప్రైజ్ వస్తే అది వాడికే చెందుద్ది. అదే ధర్మం–అదే న్యాయం'' నాకన్నా మొండిగా అన్నాడు వాడు.

''అలాగా?'' అన్నాన్నేను కించిత్ వ్యంగ్యంగా.

నా వ్యంగ్యాన్ని వాడు పట్టించుకోలేదు. ''అవును. ప్రైజొచ్చింది 1740 నెంబర్ గల టికెట్‌కి. దానిమీదున్న సీట్ నెంబర్ సి–18. మొన్న సి–18 సీట్లో కూర్చుంది నేనే కాబట్టి అది నా టికెట్ కిందే లెక్క. సో..ఆ బంగారు గొలుసు నాకే చెందాలి'' అన్నాడు ఖండితంగా.

''ఆ సీట్లో ఎవరు కూర్చున్నారన్నది ప్రశ్నకాదు! ఆరోజు టికెట్లు తీసింది నేను. కౌంటర్ ఫాయిల్స్ జేబులో పెట్టుకున్నది నేను! ప్రస్తుతం కూడా అవి వున్నది నాదగ్గరే! సో..ఆ బంగారు గొలుసు నాదే–నీకు చచ్చినా ఇవ్వను.''

''ఎలా ఇవ్వవో నేనూ చూస్తాను.''

''ఏంటోయ్ నువ్ చూసేది?'' నేను గట్టిగా అరిచాను. అంతసేపూ ఎలాగో నిగ్రహించుకున్నానుగానీ ఇప్పుడింక నాలో సహనం చచ్చిపోయింది.

ఎంత ఆశ?

అప్పనంగా ఆ బంగారు గొలుసు కాచేద్దామనుకుంటున్నాడు వెధవ!... మనసులో వాణ్ణి ప్రచురణార్హం కాని ఓ బండబూతు తిట్టుకున్నాను.

అంతలో...నా అరుపుకి పైకొచ్చాడులా వుంది ''ఏంటయ్యా మీ గొడవ?'' అంటూ లోనికి ప్రవేశించాడు మా హౌస్ ఓనర్ రాఘవులుగారు.

''అబ్బే ఏం లేదంకుల్...'' అన్నాన్నేను.

''ఏమీ లేకపోవడమేంటి? చాలా వుందంకుల్! పెద్దవారిగా ధర్మం మీరే చెప్పండి'' అన్నాడు గవర్రాజు, నాకేసి ఓమారు తినేసేలా చూసి, తిరిగి ఆయన వైపు మళ్లుతూ.

''దేనికయ్యా కీచులాడుకుంటున్నారు? సంగతేంటో చెప్పకుండా ధర్మం చెప్పమంటే నేనేం చెప్పేది?'' అంటూ కుర్చీలో తన భారీ కాయాన్ని కూలేశాడు రాఘవులుగారు.

''మొన్న సండే మేం ముగ్గురం అజంతాలో బంగారు భర్త అనే సినిమా చూశాం అంకుల్'' అంటూ చెప్పడం ప్రారంభించాడు గవర్రాజు.

''ఊ...చూస్తే?'' అన్నాడు రాఘవులుగారు.

''ఆ థియేటర్ వాళ్లు ఒక స్కీం పెట్టారంకుల్!''

''ఏంటా స్కీము?''

''మనకిచ్చే టిక్కెట్ల మీద సీరియల్ నెంబర్ వుండుద్ది కదా! ఆరోజు అమ్మిన టిక్కెట్లన్నిటిదీ డ్రా తీసి, గెలుపొందిన నెంబర్ గల కౌంటర్ ఫాయిల్ వున్నవారికి బంగారు గొలుసు ఇస్తామని ప్రకటించారు. ఆ థియేటర్‌లో మొన్న ఆ సినిమా వందవరోజు. ఆ సందర్భంగా పెట్టారన్నమాట ఆ స్కీము. మేము కొన్న టిక్కెట్లలో ఒకదానికి ప్రైజొచ్చింది. ఇదుగో ఇవ్వాళ దినపత్రికలో వేశారు'' అంటూ ఆయన చేతికి టీపాయ్ మీదున్న పేపర్ అందించాడు గవర్రాజు.

రాఘవులుగారు ఆ పేపర్‌లోకి చూడకుండానే అన్నాడు. ''ప్రైజొస్తే వెళ్లి తెచ్చుకోండయ్యా! దానికి కీచులాటెందుకు?''

''తెచ్చుకుంటాం సరే అంకుల్. కానీ ఆ ప్రైజు ఎవరికి చెందాలన్న విషయంలో వస్తోంది గొడవ. ప్రైజొచ్చిన టికెట్ నంబర్ 1740. దానిమీదున్న సీట్ నెంబర్ సి–18. ఆ సీట్లో కూర్చున్నది నేను. కాబట్టి అది నా టికెట్టే కదా, కాబట్టి ఆ ప్రైజు న్యాయంగా నాకే చెందాలి కదా?''

''అవునూ'' అన్నాడాయన ఏమాత్రం సంకోచించకుండా.

చెప్పనీలే వెధవని అని అంతసేపూ మౌనంగా వున్న నేను ఆయనలా అనేసరికి నోరు విప్పి నా వాదన కూడా వినిపించాను.

''ఆ సీట్లో కూర్చుంది వాడే కావచ్చుంకుల్! కానీ అసలారోజు టికెట్లు కొన్నది నేనే. నా డబ్బుల్తో నేను కొన్న టికెట్‌కి ప్రైజొస్తే అది నాకు చెందడమే ధర్మం కదా!''

''అవునూ'' అన్నాడాయన మళ్లీ.

అంటే ధర్మకాటా ఈసారి నావైపు మొగ్గు చూపిందన్న మాట!

''డబ్బులు వాడివే కావచ్చుంకుల్! కానీ వాడు మాకేం పుణ్యానికివ్వలేదు. ఆ సమయానికి మాదగ్గిర లేవుకాబట్టి అప్పుగా ఇచ్చాడు. మాకు ఇళ్ల దగ్గర్నుంచి ఎం.ఒ.లు రాగానే తిరిగి ఇచ్చేయాలని చెప్పాడు. కాబట్టి ఎవరి టిక్కెట్ మీద వాళ్లకి హక్కున్నట్టే కదా?'' అంటూ మళ్లీ గళం విప్పాడు గవర్రాజు.

''అవునూ'' ఆయన మళ్లీ అలాగే అంటుంటే నాకు ఒళ్లు మండిపోయింది. కానీ అతి కష్టమ్మీద నిగ్రహించుకున్నాను. ఎంతైనా ఆయన మా హౌస్ ఓనరు. బ్రహ్మచారులమైన మాకు–అందులోనూ ఇళ్ల దగ్గర్నుంచి ఎం.ఒ.లు తెప్పించుకు తింటూ ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటున్న నిర్భాగ్య నిరుద్యోగులమైన మాకు–ఇల్లద్దెకిచ్చిన మహానుభావుడాయన. చూస్తూ చూస్తూ ఆయన మీద ఆగ్రహాన్ని వెళ్లగక్కలేను కదా!

''అదేంటంకుల్ అలా అంటారు? నేను గనక అప్పిచ్చి తీసుకెళ్లకపోతే అసలు వాళ్లు ఆ సినిమాకే వెళ్లడం అన్న ప్రసక్తే వుండదు కదా! అదీగాక ఆ థియేటర్ వాడి రూల్‌ప్రకారం చూసినా–కౌంటర్ ఫాయిల్ ఎవరి దగ్గరుంటే వాళ్లదే ప్రైజు. మొన్నట్నుంచీ ఆ కౌంటర్ ఫాయిల్స్ మూడూ నా జేబులోనే వున్నాయి...ఇప్పుడు చెప్పండంకుల్, ఆ బహుమతి నాదా–కాదా?'' అన్నాను వీలైనంత వినయంగా.

''భలే ధర్మసంకటంలో పడేశారయ్యా! కరవొద్దంటే కప్పక్కోపం, విడవొద్దంటే పాముక్కోపం అన్నట్టుగా వుంది. పోనీ ఎవరికీ నష్టం కలక్కుండా మధ్యస్తంగా నేనొక తీర్పు చెప్తాను పాటిస్తారా?'' మా ఇద్దరికేసి మార్చి మార్చి చూస్తూ అడిగాడు రాఘవులుగారు.

''చెప్పండంకుల్'' అన్నాం–ఇద్దరం సంయుక్తంగా.

''మీరు ముగ్గురూ రెండేళ్లనుంచి రూమ్మేట్లుగా వుంటున్నారు. ఎంతో స్నేహంగా వుంటున్నారు. ఇంత చిన్న విషయం కోసం ఇలా కలహించుకుని ఆ స్నేహం చెడగొట్టుకోవడం దేనికి? ఆ సినిమాకి ముగ్గురం కలిసే వెళ్లామంటున్నారు కాబట్టి ఆ బహుమతిని ముగ్గురూ సమానంగా పంచుకోండి. ఐ మీన్ ఆ గోల్డ్ చెయిన్‌ని అమ్మేసి వచ్చిన క్యాష్‌ని సమానంగా తీసుకోండి.''

ఆయన చెప్పింది బాగానే వున్నట్టనిపించి ''సరే

అంకుల్'' అన్నాన్నేను. గవర్రాజు ఏమనుకున్నాడో ఏమోగానీ తనూ సరే అనేశాడు.

''దట్స్ గుడ్...'' అని ప్రశంసించి ''అన్నట్టు మహేష్ ఏడి'' అని అడిగారు రాఘవులుగారు.

''వాడికి షార్ట్‌హ్యాండ్ క్లాసుందిగా! ఇన్‌స్టిట్యూట్ నుండి ఇంకా రాలేదు'' చెప్పాన్నేను.

అలాగా అన్నట్టు తలాడించి ''సరేనయ్యా! ఇంక నేనొస్తాను'' మళ్లీ ఏం కీచులాడుకోవద్దు సుమా!'' అంటూ వెళ్లిపోయాడాయన.

ఆయన నెరిపిన మధ్యవర్తిత్వం వల్ల ఆవేశ కావేషాలు కాస్త సర్దుమణగటంతో గదిలో మిగిలిపోయిన మేమిద్దరం నార్మల్ మూడ్‌లోకి వచ్చేశాం.

''దాన్నమ్మితే ఏం వస్తుందంటావ్?'' అన్నాడు గవర్రాజు.

''ఏమోరా! వాళ్లు అనౌన్స్ చేసింది పది గ్రాములని కదా! నాలుగైదు వేలు రావచ్చు'' అన్నాను నేను.

''అంటే మనిషికో పదిహేను వందల్దాకా వస్తాయన్న మాట!'' అన్నాడు వాడు.

''ఆ రావచ్చు...'' అని నేనింకా అంటూనే వున్నాను. ఈలోగా ''ఎంట్రోయ్ మనిషికి పదిహేనొందలంటున్నారు! కొంపదీసి మీ ఇద్దరిలో ఎవరికైనా లాట్రీ తగిలిందా?'' అంటూ లోపలికొచ్చాడు మహేష్.

''యు ఆర్ ఎగ్జాక్ట్లీ కరెక్ట్. లాట్రీనే తగిలింది'' అంటూ గవర్రాజు వాడికి, సంతోషంగా విషయం వివరించాడు.

''ఈజిట్?'' అంటూ మహేష్ తన చేతిలో వున్న ఫైల్ లోంచి దినపత్రికని బైటికి తీశాడు. అలా అలా ఓ రెండుమూడు పేజీలు తిప్పి ''ఆ.. ఇక్కడేశ్రా.. టికెట్ నెంబర్ 1704'' అన్నాడు గట్టిగా.

''1704 కాదురా! 1740-సరిగ్గా చూడు'' అన్నాన్నేను కొంచెం గాభరాగా.

''అబ్బే లేదే! ఇక్కడ 1704 అనే వుంది'' అన్నాడు మహేష్. అంటూనే ఆ నెంబర్ మాక్కూడా చూపించాడు. నిజమే అక్కడ 1704 అనే వుంది!

మరి ఇవ్వాళ దినపత్రికలో 1740 అని వేశారే! ఈ రెంటిలో ఏది కరెక్టు?

దీన్ని గురించి కాసేపు ఆందోళన చెంది, ఆ మీదట మరికాసేపు తర్జన భర్జన గావించి, ఆ మీదట ముగ్గురం కలిసి అజంతా థియేటర్‌కి వెళ్లాం.

మేనేజర్‌కి మాదగ్గరున్న టికెట్ సరెండర్ చేసి, బంగారు గొలుసు అడిగాం. ''సారీ సార్! ఇవ్వాళ దినపత్రికలో అచ్చు తప్పు దొర్లింది. 1740 కాదు ప్రైజొచ్చింది, 1704కి. కావాలంటే ఇది చూడండి'' అంటూ దినపత్రిక తీసి మాకు చూపించాడు మేనేజర్.

ఏమంటానికీ మాకు నోళ్లు రాలేదు.

చదువుకున్నవాళ్లమయ్యుండి అంత చిన్న విషయానికి అతన్తో గొడవ పడ్డం సభ్యతగా వుండదనిపించి ''ఇట్సాల్‌రైట్ సార్! నోప్రోబ్లం'' అనేసి అక్కణ్ణుంచి వెనుదిరిగాం నీరసంగా.

మేం థియేటర్‌లోంచి బయటికొస్తుండగా నల్లగా తుమ్మమొద్దులా వున్న ఓ వ్యక్తి మాకెదురయ్యాడు. అతని చేతిలో దినపత్రికా, ఓ టికెట్టు ముక్కా వున్నాయి. అతను చాలా హుషారుగా వుండటం చూసి ''ఏంటి సార్? గోల్డ్ చెయిన్‌గాని కొట్టేశారా ఏంటి?'' అని అడిగేశాన్నేను వుండబట్టలేక.

''అవునండీ...'' అన్నాడతను సంతోషంగా.

అతని కనుబొమలు రెండూ కలిసిపోయి వుండటం గమనించాన్నేను.

అలా కనుబొమలు కలిసుంటే అదృష్టం అంటారు! అది ఇతని విషయంలో నిజమే అయ్యింది కదా? అనుకున్నాను.

''కంగ్రాచ్యులేషన్స్ సార్! వెళ్లి మీ టికెట్‌ని మేనేజర్‌కి సరెండర్ చేసి ప్రైజ్ తీస్కోండి'' అన్నాను అతన్తో.

''అలాగే సార్! థాంక్స్'' అంటూ అతను థియేటర్ లోకి వెళ్లిపోయాడు.

''హీ ఈజ్ ఎ లక్కీగై'' అన్నారు నా రూమ్మేట్స్ ఇద్దరూ అతను వెళ్లిన దిక్కే చూస్తూ.

''అవునవునవును... అతని కనుబొమలు కల్సిపోయి వున్నాయి. అలా వున్నవాళ్లంతా అదృష్టవంతులే'' అన్నాన్నేను-అదేదో యూనివర్సల్ ట్రూత్ అయినట్టు.




• • •

మర్నాడు పొద్దున్న మేం ముగ్గురం కోమల విలాస్‌లో టిఫిన్ చేసి బయటికొస్తుంటే యాదృచ్ఛికంగా ఆ అదృష్టవంతుడు మళ్లీ మాకు తారసపడ్డాడు.

అప్పుడే అతనో ఆటో ఎక్కుతున్నాడు.

''ఏం సార్? గోల్డ్ చెయిన్ తీసుకున్నారా?'' అన్నాన్నేను చెయ్యి ఊపుతూ.

''లేదండీ! ఆ దినపత్రికలో రాంగ్ నెంబర్ ప్రింటయ్యిందట! ప్రైజొచ్చింది నా నెంబర్‌కి కాదట. అందుకని ఇవ్వలేదు'' అని అంటూనే వున్నాడు. ఈలోగా ఆ ఆటో ముందుకురికింది.

''సార్...సార్...'' అని మేం ముగ్గురం గట్టిగా అరిచాం గానీ అప్పటికే ఆ ఆటో మా అరుపుల కందనంత దూరం వెళ్లిపోయింది.

ఔరా! ఎంత మోసం?! మా ముగ్గురికీ ఏక కాలంలో మతిపోయింది.

★